క్లుప్తంగా

గొర్రె, మేకలకు పీపీఆర్ టీకాలు వేయించాలి


గొర్రెలకు టీకాలు వేస్తున్న లైవ్‌స్టాక్ ఆఫీసర్

జగిత్యాల: మేకలకు, గొర్రెలకు అందరు పీపీఆర్ టీకాలు తప్పకుండా వేయించాలని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం ధర్మారంలో 993 గొర్రెలకు, 271 మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఈ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. టీకా వేయించకపోతే పుర్రు రోగం, దొబ్బరోగం వస్తాయన్నారు. పెంపకందారులు జీవాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్, రాజు, వనిత, సంజయ్ పాల్గొన్నారు.

ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు


షుగర్ పరీక్షలు చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వేంపేటలో ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మెట్‌పల్లి వారి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 115 మందికి పరీక్షలు నిర్వహించారు. డయాబెటిక్ మంత్ సందర్భంగా పలు చోట్ల ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ గాజంగి రాజమల్లయ్య, తిరుమలచారి, మారుతి, మహ్మద్ వాసే, గాజంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమోహన్ మృతి తీరని లోటు

జగిత్యాల: సినీ నటుడు చంద్రమోహన్ మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని కళాశ్రీ అధినేత గుండేటి రాజు అన్నారు. కళాశ్రీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో గొప్ప సినిమాల్లో నటించి ప్రతిష్ఠాత్మక అవార్డులు, పురస్కారాలు పొందిన నటుడు చంద్రమోహన్ అని, అతని మృతి కళాకారులకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో సాహితివేత్తలు శ్రీనివాస్‌గౌడ్, ఎలగందుల రవి, దేవయ్య, రాజేంద్రప్రసాద్, గంగాధర్, వెంకటేశ్వర్లు, శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.

ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

రాయికల్: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ శనివారం తాట్లవాయిలోని సీతారామస్వామి ఆలయంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తాట్లవాయి, ధర్మాజీపేట, అల్యానాయక్, కైరిగూడెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు సందునాయక్, స్నేహలత, యూత్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు మల్లేశ్, వినోద్, సురేందర్‌నాయక్ పాల్గొన్నారు.

న్యాయవాదుల ప్రచారం..

సారంగాపూర్: జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు మద్దతుగా శనివారం బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో జగిత్యాలకు చెందిన పలువురు న్యాయవాదులు ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన, అభివృద్ధి రెండు సీఎం కేసీఆర్ ద్వారా జరిగాయని పేర్కొంటూ ప్రచారం నిర్వహించారు. వారి వెంట బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ చైర్మన్ నేరెళ్ల సుమన్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప ఉన్నారు.

బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ

రాయికల్: మండలంలోని కట్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల తిరుపతి తల్లి శనివారం మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి వేర్వేరుగా పరామర్శించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

నిలిచిన రోళ్లవాగు పనులు

- అనుమతులు ఇవ్వని అటవీశాఖ
- తూములకు బిగించని షటర్లు
- ప్రాజెక్టు పూర్తయితే 20 వేల ఎకరాలకు సాగు నీరు


రోళ్లవాగు ప్రాజెక్టు


తూము నుంచి దిగువకు వెళ్తున్న నీరు

సారంగాపూర్: దేవుడు వరమిచ్చినా,... పూజారి కరుణించ లేదన్న చందంగా మారింది రోళ్లవాగు ప్రాజెక్టు పరిస్థితి. ప్రాజెక్టు పనులు దాదాపు 92 శాతం పూర్తయినా, చివరి దశ పనులకు అటవీశాఖ అనుమతి ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల చేయడానికి ఏర్పాటు చేసిన మూడు తూములు (స్లూయిస్)కు షటర్లు బిగించకపోవడంతో ప్రాజెక్టులో నీరు నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

రోళ్లవాగు ప్రాజెక్టు స్వరూపం..

బీర్‌పూర్ మండల కేంద్రం శివారుల్లో బీర్‌పూర్, నర్సింహులపల్లె, చెర్లపల్లి గ్రామాల మధ్య గతంలో ఉన్న రోళ్లవాగు ప్రాజెక్టును ఆధునీకరించడానికి 2017లో ప్రభుత్వం పనులు చేపట్టింది. ప్రాజెక్టులో అప్పటి వరకు 0.25 టీఎంసీ నీరు నిలువ ఉండగా, ప్రాజెక్టు ఆధునీకరణ పూర్తయితే నీటి నిలువ సామర్థ్యం 1 టీఎంసీ చేరుకుంటుంది. ప్రాజెక్టు నిర్మాణం మొదట రూ. 60.50 కోట్లతో పనులు ప్రారంభించగా, పనుల జాప్యం, పెరిగిన వ్యయంతో ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం రూ. 136 కోట్లకు చేరింది. ప్రాజెక్టు ఆధునీకరణ పూర్తయితే బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 20 వేల ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు చుట్టూ గుట్టలు, వాగులు ఉండగా వర్షపు నీరు ప్రతి చుక్క ప్రాజెక్టులోకి చేరుతుంది. దీంతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ–53,12 ఎల్, ఆర్‌వి మెయిన్ ద్వారా ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది.

ప్రాజెక్టులో భూములు ఇలా..

రోళ్లవాగు ప్రాజెక్టులో 200 ఎకరాలు పట్టాభూములు, రెవెన్యూ భూములు 600 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. పట్టాదారులకు పరిహారం అందించారు. రెవెన్యూ భూములకు అనుమతులు వచ్చాయి. కాగా అటవీశాఖకు చెందిన 860 ఎకరాల ప్రాజెక్టులో మునిగిపోతుంది.

పూర్తి అయింది ఇలా..

ప్రాజెక్టులో మూడు కట్టల నిర్మాణం చేపట్టారు. ఈ మూడు కట్టల పొడవు 1.600 కిలోమీటర్లు పొడవు ఉంటుంది. దీనితో పాటు 156 మీటర్ల పొడవు, 12.50 మీటర్ల ఎత్తుతో మత్తడి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా మత్తడి నిర్మాణం వందశాతం పూర్తయింది. కట్ట నిర్మాణాలు, కట్ట కోతకు గురికాకుండా రాళ్లతో జరిపే తెట్టె నిర్మాణాలు 90 శాతం వరకు పూర్తి అయ్యాయి. దిగువకు నీటిని విడుదల చేయడానికి మూడు తూములను (స్లూయిస్) ఏర్పాటు పనులు పూర్తి చేశారు.

అటవీశాఖ అనుమతులు రాక నిలిచిపోయిన తూములకు షటర్ల బిగింపు పనులు..

దిగువకు నీటిని విడుదల చేయడానికి ఏర్పాటు చేసిన మూడు తూములకు ప్రతి తూముకు రెండు చొప్పున ఆరు షటర్లు బిగించాల్సి ఉంది. కాగా షటర్ల బిగింపు పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. దీంతో ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని నిల్వ చేసే వీలులేకుండా పోయింది. మూడు తూములకు షటర్ల బిగింపుకు రూ. 90 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇందుకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయి.. కానీ షటర్ల బిగింపు ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. మూడు తూములకు షటర్లు బిగింపు చేస్తే ప్రాజెక్టులోకి వచ్చిన నీరు వచ్చినట్లు నిలువ చేరడంతో అటవీభూముల్లో ఉన్న మొత్తం వృక్ష సంపద, వన్యప్రాణులు, అటవీభూములకు నష్టం జరుగుతుందని అటవీశాఖ మొదటి నుంచి రోళ్లవాగు పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉంది. షటర్ల బిగింపుతో పాటు, అటవీశాఖ పరిధిలోని రెండో కట్ట నిర్మాణం పూర్తిగా అటవీ భూముల్లోనే ఉంది. దీంతో రెండో కట్ట నిర్మాణ పనులు కూడా ఆగిపోయాయి. ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

అనుమతుల కోసం నిరీక్షణ



అటవీశాఖకు ప్రభుత్వం జిల్లాలోని పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి, నంచర్ల, దీకొండ గ్రామాలతో పాటు, గొల్లపల్లి మండలంలోని చందోలిలో రెవెన్యూ భూములను ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూములను అటవీశాఖకు అందజేయడానికి ఆయా గ్రామాల ప్రజలు ఒప్పుకోకపోవడంతో అటవీశాఖకు భూముల కేటాయింపు ప్రక్రియ ఆగిపోయింది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. అనుమతులు వచ్చే వరకు షటర్లు బిగింపు కాని, మిగిలిన పనులు కాని చేపట్టవద్దని అటవీశాఖ అధికారులు పనుల వద్దకు వచ్చి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా పనులు పూర్తిగా నిలిపివేశాం.

– చక్రూనాయక్, డీఈ, రోళ్లవాగు ప్రాజెక్టు

ఎస్సీ వర్గీకరణతోనే రిజర్వేషన్ ఫలాలు


హైదరాబాద్ సభకు వెళ్తున్న దళిత నాయకులు

మల్యాల: ఎస్సీ వర్గీకరణతోనే రిజర్వేషన్ ఫలాలను మాదిగలు పొందుతారని, మాదిగలు ఏకతాటిపై నిలబడి హక్కుల సాధన కోసం పోరాడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా హైదరాబాద్‌లో చేపట్టే మాదిగల విశ్వరూప మహాసభకు మల్యాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి దళిత సంఘాల నాయకులు తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నలువాల సంజీవ్, న్యాయవాది బొల్లి కిషన్, ముప్పారపు రవీందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల రిజర్వేషన్ ఫలాలు పొందడం సాధ్యమని, విశ్వరూప మహాసభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ విశ్వరూపం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మారంపల్లి గంగాధర్, తైదల అంజయ్య, దొనకొండ రమేశ్, గంగాధర్, సిద్దంకి శాంతి, గంగన్న, బొల్లి శ్రీను, లింగన్న, మారుతి, రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మేడిపల్లి: మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన విశ్వరూప మహాసభకు భీమారం మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో అధ్యక్షుడు చిలివేరి వెంకటేశ్, బంగారు దీపక్, మకిలి కుమార్, పసుల అంజి, రాజయ్య, దవాస గంగాధర్, తదితరులు ఉన్నారు.



భూమి ఆరలే.. ‘కోత’కు తిప్పలే

- తేమ కారణంగా పొలాల్లో దిగబడుతున్న టైర్ హార్వెస్టర్లు
- చైన్ మెషిన్లు తీసుకువస్తే రూ.వేలల్లో ఖర్చు
- వరి కోతలపై రైతుల్లో ఆందోళన


వరి కోస్తూ పొలంలో దిగబడిన హార్వెస్టర్

జగిత్యాల అగ్రికల్చర్: వరి బాగా పండిందని సంబరపడుతున్న రై తులకు ఆ పంటను కోయించడంలో మాత్రం ఇబ్బందులు త ప్ప డం లేదు. తేమగా ఉన్న భూముల్లో టైర్ హార్వెస్టర్లతో కో యి స్తే దిగబడుతున్నాయి. చైన్ హార్వేస్టర్లతో కోయిద్దామంటే రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

దాదాపు 3.05 లక్షల ఎకరాల్లో సాగు

జగిత్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి దాదాపు 3.05 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం కోత దశకు చేరింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో పండిన పంటను కోయించలేక రైతులు దిక్కులు చూస్తున్నారు. దీనికంతటికీ కారణం అధిక వర్షాలే. ఈ ఏడాది అక్టోబర్ వరకు వానలు కురవడంతో భూగర్భజలాలు 2 నుంచి 3 మీటర్ల లోతులోనే ఉన్నాయి. దీనికితోడు, ఎస్సారెస్పీ నీటితోపాటు చెరువులు, కుంటల నుంచి వర్షపు నీరు పారుతుండటంతో సమీపంలోని పొలాల్లో అధిక తేమ ఉంది. పంట కోయించే దశలో ఒక్కసారి వర్షం పడితే కనీసం 15 నుంచి 20 రోజుల వరకు అందులో నడవడం కూడా కష్టమే. ఈ నేపథ్యంలో పొలాలు కోసేందుకు వచ్చే హార్వేస్టర్లు దిగబడుతున్నాయి. రైతులు సాహసించి కోయించేందుకు సిద్ధపడినా, దిగబడితే యజమానులు అటువైపు చూడటం లేదు.

టైర్ హార్వెస్టర్ అయితే రూ.2 వేలు

భూమిలో తేమ లేకపోతే టైర్ హార్వెస్టర్లు వరిని సులభంగా కో స్తాయి. ఇందుకోసం ఎకరాకు రూ.2 వేల వరకు ఇస్తే సరిపోయేది. కానీ, ప్రస్తుతం టైర్ హార్వెస్టర్లు దిగబడుతుండటంతో చైన్ హార్వెస్టర్ల అవసరం ఏర్పడింది. ఇవి మన ప్రాంతంలో ఎక్కువగా లేకపోవడంతో దళారులు తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్నారు. వీటికి ఎకరాకు రూ.6 నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతుందని తెలిసి, రైతులు అయోమయంలో ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలకు తరలించడం కష్టమే

ఎలాగోలా పంటను కోయించినప్పటికీ, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడం సైతం కష్టంగానే మారింది. సాధారణంగా టైర్ హార్వెస్టర్ కోస్తే అక్కడికే ట్రాక్టర్ వెళ్తుంది. ధాన్యాన్ని ట్రాక్టర్ డబ్బాలో పోస్తారు. కానీ, తేమతో ఉన్న పొలంలోకి దిగితే ట్రాక్టర్ సైతం దిగబడుతుంది. ఇది వద్దనుకుంటే చైన్ హార్వెస్టర్‌తో పొలం కోయించుడు ఒక్క ఎత్తయితే, ధాన్యాన్ని ఒడ్డున ఉన్న ట్రాక్టర్‌లో పోయడం మరో ఎత్తులా మారింది పరిస్థితి. పొలంలో ట్రాక్టర్ దిగబడ్డా, హార్వెస్టర్ దిగబడ్డా రైతులకు చుక్కలు కనబడుతున్నాయి.

చైన్ హ్వార్వెస్టర్ కోసం చూస్తున్న



నేను మూడెకరాల్లో వరి పంట వేసిన. కోతకు వచ్చింది. భూగర్భజలాలు పైనే ఉండటంతో భూమంతా తేమగా ఉంది. టైర్ హార్వెస్టర్లు నడిచే పరిస్థితి లేదు. దీంతో, రేటు ఎక్కువైనప్పటికీ చైన్ హార్వెస్టర్ కోసం చూస్తున్న.

– ఏలేటి స్వామిరెడ్డి, శ్రీరాములపల్లె, గొల్లపల్లి మండలం

ఏం చేయాలో తెలుస్తలేదు



నేను నాలుగెకరాల్లో వరి సాగు చేసిన. పొలం కోయిద్దామంటే హార్వెస్టర్లు దిగబడుతున్నాయి. భూమిలో తేమ ఆరేవరకు ఉంచుదామంటే, గాలి వీస్తే గింజలు నేలరాలుతున్నాయి. ఏం చేయాలో తెలుస్తలేదు.

– గణపతి, దొంతాపూర్, ధర్మపురి మండలం

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

మేడిపల్లి: ఉమ్మడి మండలంలోని గోవిందారం, వెంకట్రావుపేట, కాచారం, విలయతబాద్, కొండపూర్ గ్రామాల్లో శనివారం ఆది శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం చేశారు. గోవిందారంలో 100 మంది బీజేపీ తుల ఉమ వర్గం నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కొండాపూర్‌లో 20 మంది బీజేపి కార్యకర్తలు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, ఉపసర్పంచ్ గంగారెడ్డి, భాష, జీవన్, సయ్యద్, చాందు,లక్ష్మణ్, మధు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ వేములవాడ అధ్యక్షుడిగా పేట నారాయణ నియామకం

దుబాయి నుంచి ఇటీవల స్వగ్రామానికి వచ్చిన పేట నారాయణను గల్ఫ్ వేములవాడ అధ్యక్షుడిగా నియమించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు.

కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కథలాపూర్: మండలంలోని పోతారం, కథలాపూర్ గ్రామాల్లో పలు కులసంఘాల వద్ద మండల కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అన్ని వర్గాల సంక్షేమం కోరేది కాంగ్రెస్‌పార్టీ అని పేర్కొన్నారు. పార్టీని గెలిపించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, వెలిచాల సత్యనారాయణ, పులి హరిప్రసాద్, నారాయణరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

గొల్ల కురుమలకు బీజేపీ అన్యాయం


మాట్లాడుతున్న యాదవ నాయకులు

మల్లాపూర్: గొల్ల కురుమలకు బీజేపీ అన్యాయం చేసిందని అఖిల భారతీయ యాదవ సంఘం మండల అధ్యక్షుడు సంగ గంగరాజం అన్నారు. శనివారం మల్లాపూర్‌లో మాట్లాడారు. బీజేపీ గొల్ల కురుమలు, యాదవుల మనోభావాలతో చెలగాటమాడుతుందని దుయ్యబట్టారు. వేములవాడ బీజేపీ అభ్యర్థిగా తుల ఉమను ప్రకటించి నామినేషన్ల చివరి రోజున బీ ఫాం ఇవ్వకుండా మరోకరికి కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గొల్ల కురుమ మహిళ పట్ల బీజేపీ అధిష్ఠానం చేసిన అవమానానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తుల ఉమకు అఖిల భారతీయ యాదవ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఏ నిర్ణయం తీసుకున్న మా సంఘీభావం ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో అఖిల భారతీయ యాదవ సంఘం మండల ప్రధాన కార్యదర్శి దనరేకుల సంతోష్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడు వెల్పుల రాజగంగరాజం, బజారు మదన్, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెళ్లికి సాయం

జగిత్యాలటౌన్: నిరుపేద యువతి పెళ్లికి అండగా నిలిచింది సత్యసాయి సేవా సమితి. జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాకు చెందిన ముస్కం గంగాధర్ జమున దంపతుల కూతురు సోనికి వివాహం నిశ్చయం కాగా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బట్టు రాజేందర్ చొరవతో డా ఎన్నాకుల సాయి ప్రణీత, రాము దంపతులు పెళ్లికి కావాల్సిన బంగారు మంగళసూత్రం, వెండిమెట్టిలు,పెళ్లి చీర, మంగళహారతి సెట్, బింద ప్లేట్లు తదితర సామగ్రితో పాటు 25కిలోల బియ్యం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా బట్టు రాజేందర్ మాట్లాడుతూ పేద జంటకు అండగా నిలిచేందుకు చొరవ చూపిన డాక్టర్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


సంగెం–శ్రీరాంపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

మల్లాపూర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మల్లాపూర్ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని సంగెం–శ్రీరాంపూర్, ఒబులాపూర్, తండా, నడికుడ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. రైతుబంధు కమిటి జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్ రెడ్డి, సర్పంచ్‌లు పాలేపు దిలీప్, అలిశెట్టి రవి, భూక్య రజిత, రుక్మా పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : సంజయ్‌కు మద్దతుగా ఎంపీపీ జాజాల భీమేశ్వరి, మాజీ ఎంపీపీ పుష్పలత మండల కేంద్రంతోపాటు గోధూర్‌లో ప్రచారం నిర్వహించారు. గోధూర్ సర్పంచ్ సోమ ప్రభాకర్, నాయకులు జగన్‌రావు, జెడి.సుమన్ పాల్గొన్నారు.

అయిలాపూర్‌లో జెడ్పీటీసీ..

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య ఆధ్వర్యంలో మహిళా నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కేసీఆర్ భరోసా కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, సర్పంచ్ పిడుగు రాధ, ఎంపీటీసి గుగ్గిళ్ల ప్రియాంక, మహిళలు పాల్గొన్నారు.

సంజయన్న దరువు సీడీ ఆవిష్కరణ

కోరుట్ల రూరల్: పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సంజయన్న ధరువు సీడీని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర రావు శనివారం ఆవిష్కరించారు. చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన బొల్లె వనిత పాడిన పాటను సీడీగా రూపొందించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్,నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు



దీపావళి వేడుకల్లో చిన్నారుల సంబురాలు

రాయికల్: మండల కేంద్రంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో శనివారం దీపావళి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగాధర్ దీపావళి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లలిత పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని లాస్య ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో వివిధ రంగులతో ముగ్గులు వేసి, ప్రమిదలు వెలిగించి, ఘనంగా దీపావళి వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజు, హెచ్‌ఎం సుష్మ విద్యార్థులు పాల్గొన్నారు.